క్లుప్తంగా

తల్లిపాలే బిడ్డకు అమృతం


తల్లి పాల వారోత్సవంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్

అల్లాదుర్గం(మెదక్): తల్లి పాలు పుట్టిన బిడ్డకు అమృతమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగ మణి చెప్పారు. బుధవారం మండల పరిధిలోని గడిపెద్దాపూర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉందని, పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లి పాలు తాగించాలని కోరారు. వ్యాధులు రాకుండా తల్లి పాలు నివారిస్తాయని తెలిపారు. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలే తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాములు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఎస్‌ఐ శంకర్


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

అల్లాదుర్గం(మెదక్): సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శంకర్ చెప్పారు. బుధవారం మండల పరిధిలోని గడిపెద్దాపూర్ జెడ్పీ పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్ లోన్‌లతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయినట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఓటీపీ ఎట్టి పరిస్థితుల్లో చెప్పకూడదన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి లక్షలు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని, ఇలాంటి వారిపై యువత జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ సూచించారు. సైబర్ నేరాలపై ఎంత అవగాహన కల్పిస్తున్నా.. మోసాలు జరుగుతూనే ఉన్నాయన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

వ్యవసాయాధికారి రాజశేఖర్‌గౌడ్


అవగాహన కల్పిస్తున్న ఏఓ రాజశేఖర్‌గౌడ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని గంగారం గ్రామ రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగుకు చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, ముందుగానే పలు కంపెనీలతో ఒప్పందం చేసుకోవడంతో కొనుగోలుకు ఇబ్బందులు ఉండవన్నారు. పైగా ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలు సైతం సాగు చేసుకుంటూ లాభాలు గడించవచ్చన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం సంపాదించుకునే అవకాశం ఉందన్నారు. రైతు శ్రీనివాస్‌రెడ్డికి చెందిన ఐదు ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు డీడీ కట్టించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు కృష్ణవేణి, అనిత, లీవ్‌పామ్ కంపెనీ ఫీల్డ్ అసిస్టెంట్ మౌనిక పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేశం


ఏదులపల్లిలో అస్తవ్యస్థ డ్రైనేజీ వ్యవస్థను చూపుతున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పల్లెల్లో పారిశుద్ధ్యం లోపించిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లేశం అన్నారు. మండలంలోని ఏదులపల్లిలో బుధవారం సీపీఎం నాయకులు పర్యటించి క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాల వెనుక భాగంలో గడ్డి ఏపుగా మొలవడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. పలు కాలనీల్లో మురుగు కాల్వలు సక్రమంగా లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని చెప్పారు. దళితబస్తీలో డ్రైనేజీ వ్యవస్థ లేక దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గౌరి, మండల కమిటీ సభ్యులు సుధాకర్, కుమార్, మైసయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల లేమితో సతమతం

సమస్యల వలయంలో రంగంపేట ఉన్నత పాఠశాల

- అసంపూర్తిగా తరగతి గదుల నిర్మాణాలు
- ఆరుబయటే మధ్యాహ్న భోజనాలు


చెట్ల కింద వంట చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

కొల్చారం (నర్సాపూర్): పాలకులు మారుతున్నా ప్రభుత్వ పాఠశాలల వెతలు తీరడం లేదు. ప్రైవేట్‌లో తమ పిల్లలను చదివించే స్తోమత లేని తల్లిదండ్రులు వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలనుకుంటే సమస్యలు వెక్కిరిస్తున్నాయి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అధికారులు ప్రచారం చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. అనేక పాఠశాలల్లో ఏళ్ల క్రితం తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ నేటికీ అవి పూర్తికాక అసంపూర్తిగా మిగిలాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించి వెళ్లడం తప్పించి సమస్యకు పరిష్కరం చూపింది లేదు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని చెట్ల కిందే వండడం, విద్యార్థులు ఆరుబయటే భోజనాలు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలలో ఇదే విధంగా సమస్యలు తాండవిస్తున్నాయి.

విద్యార్థులు ఎక్కువ.. వసతులు తక్కువ

రంగంపేట ఉన్నత పాఠశాలలో మండలంలోనే అత్యధికంగా 479 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే, వారికి కావాల్సిన స్థాయిలో మాత్రం వసతులు లేవు. చుట్టూ 7 గ్రామాలకు చెందిన విద్యార్థులు ఈ పాఠశాలకు వస్తుంటారు. తెలుగు, ఆంగ్లం మాధ్యమంలో బోధన సాగుతుంది. పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సి ఉండగా ఇక్కడ అటువంటి పరిస్థితులు కనిపించడం లేదు. రోజూ 400 మందికి పైగా విద్యార్థులకు భోజనం తయారు చేయాల్సి ఉండగా కనీసం వంట గది లేదు. వానొచ్చినా.. ఎండొచ్చినా మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆరుబయట చెట్ల కిందే వంట వండాల్సిన పరిస్థితి. చెట్ల పైనుంచి వాన చినుకులు, చెత్తాచెదారం పడకుండా చూసేందుకు మధ్యాహ్న భోజన నిర్వాహకులు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో హడావుడిగా వంట గది నిర్మాణం చేపట్టినప్పటికీ పూర్తి సౌకర్యవంతంగా లేకపోవడంతో అది కాస్తా నిరుపయోగంగా మారింది.

భోజనం చేయాలన్నా కష్టమే..


చెట్ల కింద భోజనం చేస్తున్న విద్యార్థులు

వడ్డించిన భోజనాన్ని తినేందుకు ప్రత్యేకంగా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కిందే భోజనాలు చేస్తున్నారు. ఏళ్లుగా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారుల్లో మాత్రం చలనం రావడం లేదు. విద్యార్థులు భోజనం చేసేందుకు 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద రూ.13 లక్షలు వెచ్చించి డైనింగ్ హాల్ నిర్మాణ పనులు చేపట్టినా అది కూడా అసంపూర్తిగా ఉండడంతో పనికి రాకుండా పోతోంది. నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేశాడు.

చెట్ల కిందే భోజనాలు



పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో చెట్ల కిందే భోజనాలు చేస్తున్నాం. వానొస్తే ఇక చెప్పే పరిస్థితి లేదు. భోజనం చేయాలంటే ఇబ్బందికరంగా ఉంది.

- అక్షయ, పదో తరగతి విద్యార్థిని

వానొస్తే ఇబ్బందే..



వంట చేసేందుకు ప్రత్యేకంగా గది లేదు. ఆరుబయట చెట్ల కింద కట్టెలతో వంట చేయడం వానకాలం ఇబ్బందిగా ఉంది. 400 మందికి పైగా పిల్లలకు వానకాలంలో ఆరుబయట వంట చేయడమంటే కష్టమే.

- నాగరాజు, మధ్యాహ్న భోజన నిర్వాహకుడు

ఆ బాధ్యతలు అంగన్‌వాడీ టీచర్లకు అప్పగించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలమణి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న అంగన్వాడీ టీచర్లు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న ప్రీ ప్రైమరీ స్కూల్ బాధ్యతలను అంగన్‌వాడీ టీచర్లకు అప్పగించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ మాలతికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలమణి మాట్లాడుతూ.. గ్రామాలలో 3 నుంచి ఐదేళ్ల చిన్నారులు ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలలో చదువుకుంటున్నారని తెలిపారు. ప్రీ ప్రైమరీ విద్యను అంగన్‌వాడీ టీచర్లు విజయవంతంగా అందిస్తున్నప్పటికీ, నూతనంగా ఏర్పాటుకు ముందుకు వచ్చిన ప్రీ ప్రైమరీ పాఠశాలకు తాత్కాలిక పద్ధతిన టీచర్ల నియామకం చేయడం ఎందుకని ప్రశ్నించారు. మరోవైపు పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఖాళీ చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారని, ఇదేలా సాధ్యమని ప్రశ్నించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు వసంత, రాజేశ్వరీ, రేణుక, మంజుల, జయలక్ష్మి, స్వప్న, సంతోష, పద్మ, శివలక్ష్మి, కవిత, వెంకటలక్ష్మి, శాంతి పాల్గొన్నారు.


పాఠశాలలో విద్యార్థులకు మొక్కల పంపిణీ చేసిన దృశ్యం

మొక్కల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): వన మహోత్సవంలో భాగంగా కౌడిపల్లి, వెల్మకన్న గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి, పాఠశాల విద్యార్థులకు మొక్కలను పంచారు. ఒక్కో కుటుంబానికి పండ్లు, పూలుతోపాటు ఇంటి అవసరాలకు పనికివచ్చే ఆరు మొక్కలు పంపిణీ చేశారు. ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు వెంటేశం, ప్రవీణ్ పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ఈపాస్ మిషన్‌లద్వారానే ఎరువులు అమ్మాలి: ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళ చెందాల్సిన అవసరం లేదని ఏఓ స్వప్న తెలిపారు. బుధవారం మండలంలోని మహమ్మద్‌నగర్ సొసైటీలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మండలం ప్రస్తుతం 2,504 బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు. డీలర్లు ఈపాస్ మిషన్‌ల ద్వారా యూరియా అమ్మతారు కాబట్టి రైతులు ఆధార్‌కార్డుతో వచ్చి యూరియా తీసుకువెళ్లాలన్నారు. పంటలకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని అవసరానికి మించి కొనుగోలు చేయవద్దని సూచించారు. వరి, పత్తి, ఇతర పంటలకు మోతాదుకు మించి యూరియా వాడవద్దన్నారు. అధికంగా వాడితే పంటలకు చీడపీడల ఉధృతి పెరుగుతుందని తెలిపారు. పంటల సాగులో సమస్యలుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్

నర్సాపూర్: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ చెప్పారు. బుధవారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలు పరిచయం లేని వ్యక్తులకు చెప్పవద్దని సూచించారు. జిల్లా సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బ్యాంకు ఖాతాలకు బలమైన పాస్‌వర్డు కలిగి ఉండాలని ఆయన పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లింగం, ప్రిన్సిపాల్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి సాయం


బాండ్ పేపర్లు అందిస్తున్న స్నేహితులు

చేగుంట(తూప్రాన్): చిన్ననాటి స్నేహితులు రూ.2 లక్షల ఆర్థిక సాయంతో పాటు హెల్త్‌పాలసీ అందించారు. చేగుంటకు చెందిన బాసం రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు ముందుకొచ్చి సాయం చేశారు. రాజు కూతురు చదువు బాధ్యతను సైతం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పరంజ్యోతి, కృష్ణ, సిద్ధి రాములు, శంకర్, అరవింద్, రమేశ్, మహేశ్, వేణు, ప్రశాంత్, పూర్ణ, సిద్దిరాములు, సంతోష్, భిక్షపతి, నాగరాజు, నాగమణి పాల్గొన్నారు.

పామాయిల్ పంట పరిశీలన


పామాయిల్ పంటను పరిశీలిస్తున్న రైతులు

హవేళిఘణాపూర్(మెదక్): సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అక్కెనపల్లిలో రైతు సాగు చేసిన ఆయిల్‌పామ్ పంటను క్షేత్రస్థాయి పరిశీలనకు మండలం నుంచి రైతులు తరలివచ్చారు. లివ్ పామాయిల్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయా రైతులను తీసుకెళ్లి రైతు నాగేందర్ పండిస్తున్న పంటను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చిరుసంచుల వరి పంట పరిశీలన

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చిట్కుల్‌లో రైతులు సాగు చేస్తున్న చిరు సంచుల వరి పంటను సంగారెడ్డి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్ విశ్వకర్మ, డాక్టర్ అరుణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు రైతులు కేఎన్‌ఎం 12368, కేఎన్‌ఎం 12510, డబ్ల్యూజీఎల్ 1537 చిరుసంచుల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటకు కాండం తొలుచు పురుగు సోకితే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కిలోలు చల్లుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు నవీన్‌కుమార్, శ్రీరాములు, సాయిప్రసాద్, క్రిష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేద పాస్టర్లను ఆదుకోవాలి


మాట్లాడుతున్న మోసెస్

చిన్నశంకరంపేట(మెదక్): పేద పాస్టర్లను ఆదుకోవాలని మెదక్ జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు తూప్రాన్ న్యూటన్‌పీట్ట మోసెస్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కొర్విపల్లి చర్చిలో జిల్లాలోని పాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాస్టర్ల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణతో ముందుకు సాగనున్నట్లు తెలిపారు. పాస్టర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, నతనయేలు, తిమోతి, పద్మారావు పాల్గొన్నారు.

నేత్ర చికిత్స శిబిరం


రోగుల నేత్రాలను పరీక్షిస్తున్న దృశ్యం

రామాయంపేట(మెదక్): స్నేహబంధు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నేత్ర చికిత్స శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఉత్తమ్ బీడీ కంపెనీ కార్మికుల నేత్రాలను పరిశీలించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం కంపెనీ ఆవరణలో మొక్కలు నాటారు. కంపెనీ యజమాని శ్రీనివాస్, క్లబ్ అధ్యక్షుడు దామోదర్‌రావు, కార్యదర్శి దీప్‌చంద్, క్లబ్ సీనియర్ ప్రతినిధులు శ్రీనివాసరావు, క్రిష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత

శివ్వంపేట(నర్సాపూర్): అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు ఆర్థిక సహాయం అందచేశారు. మండలంలోని బిజిలీపూర్‌కు చెందిన నరేష్ రెండు నెలల క్రితం మృతి చెందాడు. 2002-03 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.31 వేలు మృతుడి కుటుంబానికి అందచేశారు. స్నేహితులు అశోక్, సురెందర్, జనార్ధన్ రెడ్డి, వెంకటేశ్, చంద్రశేకర్, శ్రీనివాస్, యాదగిరి, సలీం, కలీం తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన


రజాక్‌పల్లిలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏఓ సోమలింగారెడ్డి

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని రజాక్‌పల్లి, ఖాసీంపూర్ తండా, తిప్పన్నగుల్ల గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వర్షాధారిత పంటగా మొక్కజొన్న వేసుకోవడం ద్వారా నీటి ఎద్దడిని ఎదుర్కోంటుంది. ప్రస్తుతం పంట పూత, కంకి దశతో ఉంటుంది. కాబట్టి పంట నీటి ఎద్దడి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నీటి ఎద్దడి పంట దిగుబడిపై గణనీయమైన ప్రభావం చూపుతుందన్నారు. రైతులు సహచర రైతులు నీటి లభ్యత గల రైతులు సహకారం తీసుకోవాలని తెలిపారు.

స్ఫూర్తి ప్రదాత జయశంకర్...

జిల్లాలో బుధవారం తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహం, చిత్రపటాలకు నివాళులర్పించారు. రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం, స్ఫూర్తిదాయకమన్నారు.


మెదక్ మున్సిపాలిటీ: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జయశంకర్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం


టేక్మాల్: జయశంకర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు


రామాయంపేట: తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్, తదితరులు


వెల్దుర్తి: తహసీల్దార్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది


చేగుంట: తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకుల నివాళి


తూప్రాన్: ఆర్డీఓ కార్యాలయం వద్ద ఆర్డీఓ జయచంద్రారెడ్డి, సిబ్బంది


కౌడిపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో జయశంకర్ జయంతి వేడుకలు

సంక్షిప్త వార్తలు

◆ సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు

చేగుంట(తూప్రాన్): సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీఓ నరేష్ అన్నారు. చేగుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని నరేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ నీరజ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

◆ రామాలయాన్ని దేవాదాయశాఖకు అప్పగించొద్దు

మెదక్‌జోన్: రామాలయాన్ని ఎట్టి పరిస్థితుల్లో దేవాదాయ శాఖకు అప్పగించొద్దని ఆలయ కమిటీ అధ్యక్షుడు బి.నరేందర్ అన్నారు. బుధవారం ఆయన కమిటీ బాధ్యులతో కలిసి మాట్లాడారు. ఆలయ కమిటీ బాధ్యులుగా తనతో పాటు ఇతర సభ్యులు చాలా కాలంగా కొనసాగామని, ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదన్నారు. తమపై ఆరోపణలు రావటంతో మనోవేదనకు గురయ్యామన్నారు. ఆలయాన్ని దేవాదాయ శాఖకు కాకుండా నూతన కమిటీ వేసి వారికి అప్పగించాలని, తాము స్వచ్ఛందంగా రాజీనామా చేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంఎల్‌ఎన్ రెడ్డి, సంతోష్, తదితరులు ఉన్నారు.

◆ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి: మండల ప్రత్యేకాధికారి జగదీష్

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా పౌరసరఫ రాల శాఖ డీఎం, మండల ప్రత్యేకాధికారి జగదీష్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేట మండలం కట్టెల వెంకటాపూర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ, వైద్యాధికారి షరీఫొద్దీన్, ఇన్‌చార్జి ఎంపీఓ జాకీర్ హుస్సేన్ తదితరులున్నారు.

◆ అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

టేక్మాల్(మెదక్): మండలంలోని కాద్లూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం నూతన భవన నిర్మాణానికి బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ భూమిపూజ చేశారు. రూ.12లక్షలతో ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, పీఆర్‌ఎఈ గోపాల్, పార్టీ గ్రామ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు దుర్గాగౌడ్, అంజయ్య, శ్రీనివాస్, హరిప్రసాద్, సాయిబాబు, నర్సింలు, సిద్దు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రేగోడ్(మెదక్): రేగోడ్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను బుధవారం పీసీసీ సభ్యుడు ఎం.కిషన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్యాంరావు కులకర్ణి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్‌ఏఈ విజయ్, వట్‌పల్లి ఏఎంసీ డైరెక్టర్ శ్రీధర్‌గుప్తా, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, మాజీ సర్పంచ్ విజయభాస్కర్, మాజీ ఎంపీటీసీ నరేందర్, నాయకులు భస్వరాజ్, శివకుమార్, ప్రభాకర్, సంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం

చిలప్‌చెడ్(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి బుధవారం మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించామని బీజేపీ మండల అధ్యక్షుడు నగేష్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగౌడ్, మండల మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ పారిశుద్ధ్య పనుల పరిశీలన

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ ఆనంద్, తహసీల్దార్ గ్రేసిబాయి పరిశీలించారు. బుధవారం మండలంలోని జప్తిశివనూర్‌లో అధికారులు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడంతో పాటు ఇంటింటికి తిరుగుతు పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. అలాగే ఇంటి ఆవరణలో నిలువ నీరు ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. తొట్టెలను, పాత టైర్లలో నీరు నిల్వకుండా జాగ్రత్త పడాలని కోరారు. నార్సింగిలో మురికి కాల్వలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఈఓ నాగభూషనం పాల్గొన్నారు.

◆ గడపగడపకు బీజేపీ

నిజాంపేట(మెదక్): నిజాంపేట్ మండల కేంద్రంలో బుధవారంగడప గడపకు బీజేపీ' అనే కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షుడు సిద్దారంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.